# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రాన్ని క్రియేటర్ ఎకానమీగా తీర్చిదిద్దేందుకు వీలుగా తగిన ప్రణాళికల్ని సిద్ధం చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పల్నాడు జిల్లా వినుకొండలో పర్యటించనున్నారు.**

3. **కేంద్రంలో ఏఐ కోసం ప్రత్యేకంగా మంత్రిత్వశాఖ అవసరమనే అభిప్రాయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యక్తం చేశారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు.**

5. **రాజధాని అమరావతిలో హెచ్ఓడి టవర్లలో ఏ శాఖకు ఎంత స్థలం, ఎలా కేటాయించాలనే అంశంపై అధ్యయనం చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

==========================

రాష్ట్రాన్ని క్రియేటర్ ఎకానమీగా తీర్చిదిద్దేందుకు వీలుగా తగిన ప్రణాళికల్ని సిద్ధం చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దీనికి వివిధ టెక్ కంపెనీల భాగస్వామ్యం అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పలువురు పారిశ్రామిక వేత్తలతో వేర్వేరుగా ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. టెక్ నైపుణ్యాలు ఉన్న యువశక్తి రాష్ట్రానికి అతిపెద్ద వనరుగా పేర్కొన్నారు. యువతను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ రంగాల్లో నిపుణులుగా తయారు చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటామని చంద్రబాబునాయుడు వెల్లడించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు పల్నాడు జిల్లా వినుకొండలో పర్యటించనున్నారు. ప్రతి నెలా 3వ శనివారం నిర్వహించే 'స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఈ మధ్నాహం వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైనదానంలో హెలీపాడ్ కు చేరుకుంటారని జిల్లా అధికారులు తెలిపారు. అక్కడ నుండి రోడ్డు మార్గంలో పట్టణంలోని ఎన్ఎస్పీ మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికకు చేరుకుని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. అనంతరం వివిధ స్టాళ్లను

సందర్శిస్తారని అన్నారు. మధ్యాహ్నం ప్రజావేదిక సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమవుతారని వెల్లడించారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై సమీక్షిస్తారు.

-----------------------------

కేంద్రంలో ఏఐ కోసం ప్రత్యేకంగా మంత్రిత్వశాఖ అవసరమనే అభిప్రాయాని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన ఎఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వార్ రూమ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే ఏఐ స్టార్టప్ విలేజ్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రకటించారు.

-----------------------------

రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న హెచ్‌ఓడి టవర్లలో ఏ శాఖకు ఎంత స్థలం, ఎలా కేటాయించాలనే అంశంపై అధ్యయనం చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఇందుకోసం నయారాయపూర్, హైదరాబాద్ సచివాలయాలను పరిశీలించాలని నిర్ణయించినట్లు చెప్పారు. రాజధానిలో శాఖాధిపతుల కార్యాలయాలకు స్థలాలు కేటాయించే అంశంపై మంత్రి వర్గ ఉప సంఘ సమావేశం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు పి. నారాయణ, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, బాల వీరాంజనేయస్వామి, బీసి జనార్ధన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనలో భాగంగా విమానాశ్రయానికి నిన్న చేరుకున్న ఆయన అక్కడే వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా ప్రయాణికుల రాకపోకలు, వాణిజ్య అనుమతులు, భూ కేటాయింపులు, ఇతర అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. ఇటీవల నిర్మించిన నూతన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ – – సాంకేతిక భవనం, విస్తరించిన టెర్మినల్ భవనం సదుపాయాలు, భవన నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు.

-----------------------------

రాష్ట్ర వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న సాంకేతికత, డిజిటల్ మౌలిక వసతులపై న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న ఏఐ సమ్మిట్లో ప్రస్తావనకు రావడం గర్వకారణమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయానికి సాంకేతికతను జోడించడంలో రాష్ట్రం ముందుంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే వ్యవసాయరంగంలో పలు సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని, రైతులకు సమయానికి ఎరువులు అందించేందుకు మొబైల్ యూరియా బుకింగ్ యాప్ ప్రవేశ పెట్టిందన్నారు. శాటిలైట్ మ్యాపింగ్, ఉపగ్రహ ఆధారిత మట్టి విశ్లేషణ, పంట అంచనాలు, వాతావరణ ఆధారిత శాస్త్రీయ సేవలు అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

-----------------------------

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను హైదరాబాదులో ఆయన నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల ఎంతోమంది యువత భవిష్యత్తు నాశనమవుతోందని, వీటి వల్ల ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయని పేర్కొంటూ..

వాయిస్..25 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 131వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

అమ్మ భాష పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈరోజు అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ప్రతి ఏటా ఫిబ్రవరి 21వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ఐక్యరాజ్యసమితి విద్యా, శాస్త్రీయ, సాంస్కృతిక వ్యవహారాల సంస్థ.. యునెస్కో 1999వ సంవత్సరంలో నిర్వహించిన 30వ సాధారణ మహాసభ.. మాతృ భాషా దినోత్సవ తేదీని నిర్ణయించింది.

---------------------------

ఐసిసి పురుషుల టి 20 ప్రపంచ కప్ లో భాగంగా సూపర్ 8 గ్రూప్ 2 విభాగంలో శ్రీలంకలోని కొలంబోలో పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. ఈ రోజు రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. శ్రీలంకలోని పల్లెకెలెలో నిన్న జరిగిన మ్యాచ్ లో ఆస్ట్రేలియా, ఒమన్ పై 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఒమన్ 16.2 ఓవర్లకు 104 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. ఆస్ట్రేలియా 9.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి లక్ష్యాన్ని ఛేధించింది.

---------------------------

హిందూ మహాసముద్రాన్ని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంపై విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాబోయే 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భాతర వాతావరణ కేంద్రం తెలిపింది. అనంతరం ఈ అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని పేర్కొంది. ఆంధ్ర ప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని తెలిపింది. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్ర, యానాం, రాయలసీమల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని వాతావరణ కేంద్ర అధికారి వెంక్రటావు పేర్కొన్నారు. తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం పేర్కొంది.

=====================